



20 గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

ప్రమాదాల నివారణకు చర్యలు

- కర్నూలులో ట్రాఫిక్ రద్దీ నివారణకు యాక్షన్ ప్లాన్ - కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రహదారులపై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రహదారి భద్రత సమావేశం నిర్వహించారు. ఎస్పీ జి.బిందు మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రహదారులపై 51 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. ఆ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే, ఆర్అండ్బి, పంచాయతీ రాజ్ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించిన 52 ప్రాంతాల్లో కూడా ప్రమాదాల నివారించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు అవుతున్నందున ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ వద్ద వీలైతే అండర్ పాస్ లేదా అప్రోచ్ రోడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై మాట్లాడేందుకు తగిన పరిష్కారంతో తన వద్దకు రావాలని సంబంధిత అధికారికి సూచించారు. ఈ అంశంపై డిఒ లేఖను కూడా సిద్ధం చేయాలని డిటిసిని ఆదేశించారు. నన్నూరు హౌసింగ్ కాలనీ నుంచి నేరుగా రోడ్ ఉన్నందున అలా కాకుండా అవసరమైన సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎల్లమ్మ గుడి దగ్గర ట్రాఫిక్ నియంత్రణ ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న సమస్య అని, ఇది జెన్యూన్ సమస్య అని చెప్పారు. ఈ సమస్యకు తగిన పరిష్కారం లభించేలా త్వరగా చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ నివారణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బళ్లారి చౌరస్తా, హాస్పిటల్, రాజ్ విహార్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను అధికారులతో చర్చించారు. స్ట్రీట్ వెండర్స్, ఆటో స్టాండ్ ఏర్పాటు గల ప్రత్యామ్నాయ అవకాశాలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్, పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో కొంత స్థలాన్ని గుర్తించి ఆటోస్టాండ్ ఏర్పాటు చేసే అవకాశం ఏమైనా ఉందా పరిశీలించాలని తెలిపారు. ఆస్పత్రి వైపు ఉన్న రోడ్డును వెడల్పు చేయగలమా, ఆస్పత్రి ప్రహరీ లోపలికి నిర్మించి ఒక ఆటో స్టాండ్, స్ట్రీట్ వెండర్స్ జీవనాధారం కోసం దుకాణాలు ఏర్పాటు అంశాలపై అదనపు మున్సిపల్ కమిషనర్, ట్రాఫిక్ పోలీసు అధికారులు ఆస్పత్రి సూపరింటెండెంట్తో చర్చించాలని చెప్పారు. కలెక్టరేట్ నుంచి ఆస్పత్రికి వెళ్లే దారిలో గేదెలు, ఆవులు ఉంటున్నాయని, అలా ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ చాలా స్థలం ఆక్రమించాయని, వాటిని తగ్గించే అవకాశం ఉందా పరిశీలించాలని తెలిపారు. సిక్సాంప్ సెంటర్లో ఆర్టిసి బస్సులను రోడ్డు మధ్యలో ఆపుతున్నారని, అలా జరగకుండా డ్రైవర్లకు తగిన సూచనలు ఇవ్వాలని ఆర్టిసి ఆర్ఎంను ఆదేశించారు. రాజ్ విహార్, హాస్పిటల్, మద్దూర్ నగర్ తదితర చోట్ల బస్టాపులు సర్కిల్స్కు దగ్గరగా ఉండడం వల్ల రద్దీ ఎక్కువగా ఉంటుందని, వీటిని కొద్దిగా జరిపి ముందుకు పెట్టే అవకాశముందేమోనని పరిశీలించాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వీలుగా రాజ్ విహార్ సమీపంలో ఉన్న పాత డిపో నుంచి నందికొట్కూరు, నంద్యాల బస్సులు తిరిగే అంశాన్ని కూడా పరిశీలించాలని చెప్పారు. నగరంలో పని చేయని సిసి కెమెరాల స్థానంలో కొత్త సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. నగరంలోకి లారీలు, భారీ వాహనాలు నిర్దిష్టమైన సమయంలో అనుమతించేలా తగిన ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించాలని తెలిపారు. ఎస్పీ జి.బిందు మాధవ్ మాట్లాడుతూ... నగరంలో చాలా చోట్ల సిసి కెమెరాల్లో విజువల్స్ సరిగ్గా కనపడడం లేదని, దొంగతనాలను కనిపెట్టేందుకు సిసి కెమెరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. రహదారులపై ప్రమాదాలకు సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తామని పేర్కొన్నారు. ట్రాన్స్పోర్ట్ కమిషనర్ శ్రీధర్ రహదారి భద్రతా సమావేశానికి సంబంధించిన అజెండా అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదనపు మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఆర్ అండ్ బి ఎస్ఇ నాగరాజు, ఆర్టిసి ఆర్ఎం శ్రీనివాసులు, అదనపు డిఎంహెచ్ఒ భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

105 టిఎంసిలకు చేరిన డ్యామ్

- 81,326 క్యూసెక్కుల ఇన్ఫ్లో
- 20 గేట్ల ద్వారా 71,262 క్యూసెక్కుల నీరు దిగువకు
- 12 గేట్లు 2 అడుగుల వరకు, 8 గేట్లు 1 అడుగు పైకి ఎత్తి దిగువకు విడుదల

ప్రజాశక్తి - హోళగుంద

తుంగభద్ర డ్యామ్ 105 టిఎంసిలకు చేరింది. గురువారం 20 గేట్ల ద్వారా 81,326 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. 12 గేట్లు రెండు అడుగుల మేర, 8 గేట్లు 1 అడుగు పైకి ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 71,262 క్యూసెక్కుల నీరు డ్యామ్కు వచ్చి చేరుతోంది. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, ధవనగిరి, దాని జెన్నూర్, తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్కు వరద పోటెత్తింది. ప్రస్తుతం రోజుకు 71,262 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు కూడా జారీ చేశారు. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105 టిఎంసిలు కాగా పూర్తిస్థాయికి చేరిందని బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

- పీడీ అమర్నాథ్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గ్రామంలో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. గురువారం ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలో పారిశుధ్య పనులను మండల ప్రత్యేకాధికారి, పీడీ అమర్నాథ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఎపిఒ సాయినాథ్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇలు పాల్గొన్నారు.



శకునాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న పీడీ

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో పెట్టుబడులు
- ఎల్ఎల్సి ద్వారా 35 వేల ఎకరాలకు నీటి విడుదల
- కెజిబివి గురుకుల విద్యాలయాలకు ప్రతిపాదనలు
- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో సీజనల్ వ్యాధులు మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై స్పష్టమైన ప్రకటన చేయడం ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. ఎల్ఎల్సి ద్వారా రాబోయే ఖరీఫ్ సీజన్లోని పంటలకు 35 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. గురువారం కలెక్టర్ పి.రంజిత్ బాషా విలేకరులతో ఇష్టాగోష్టిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చి ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక యువత ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పారిశ్రామిక వాడకు ముచ్చుమర్రి నుంచి నీటిని తరలించేందుకు గతంలో ప్రాజెక్టు చేపట్టారని చెప్పారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి రూ.44 కోట్లకు పైగా అవసరం ఉంటుందని ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు వెల్లడించారు. విమానాశ్రయంలో కూడా నైట్ ల్యాండింగ్తోపాటు రన్వే అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్తో పాటు ఎంపిడిఒ తహశీల్దార్, ఇఒఆర్డి బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామాల్లో తాగునీటి సమస్యను గుర్తిస్తున్నారని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులను కూడా ఖర్చు చేసేందుకు జడ్పి నుంచి లేదా ప్రభుత్వం ద్వారా నిధులను రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈనెలాఖరులోపు గ్రామాల్లో క్షేత్రస్థాయి బృందాలు పరిశీలించి అన్ని పంచాయతీలకు సంబంధించిన పారిశుధ్యం, తాగునీటి సమస్య వంటి వాటిపై నివేదికను సమర్పిస్తారని తెలిపారు. ఇటీవల కాలంలో కెజిబివి, గురుకుల విద్యాలయాల్లో అడ్మిషన్ల డిమాండ్ పెరిగిందని చెప్పారు. తాత్కాలికంగా సీట్ల సంఖ్య పెంచుకున్నా కొంత సమస్య ఏర్పడుతుందని, అందుకే కొత్తగా కెజిబివి, గురుకుల విద్యాలయాల ఏర్పాటుకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం తయారీని ఇంకా ఆరు బయటనే తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లోనూ వంట నిర్వహణకు గ్యాస్ కనెక్షన్లు కూడా ఇచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. కర్నూలు జిల్లా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

జిజిహెచ్‌లో సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలి

- అవినీతి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు
- జిజిహెచ్ క్యాజువాలిటీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో అక్రమంగా తొలగించిన సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలని, అవినీతి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. గురువారం సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సిఐటియు) ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో క్యాజువాలిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి మారెళ్ల విజయ్ (రామాంజనేయులు) మాట్లాడారు. భద్రత కోసం ఏర్పాటు చేసిన ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని తెలిపారు. గత 20 ఏళ్లుగా ఎలాంటి ఆరోపణలూ లేకుండా పని చేస్తున్న సీనియర్ సెక్యూరిటీ గార్డు బాలతిమ్మయ్యను అక్రమంగా తొలగించడం చట్ట విరుద్ధమని చెప్పారు. అలాగే లైంగిక వేధింపులకు గురైన మహిళా కార్మికులు స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారని నిందితులైన ఏజెన్సీ ఎస్ఐలు ఫిరోజ్ ఖాన్, రవితేజను తొలగించకుండా బాధితులనే డ్యూటీ నుంచి తొలగించడం దుర్మార్గమని విమర్శించారు. జీతం, పిఎఫ్ విషయంలో గట్టిగా అడిగారని కొంతమంది సెక్యూరిటీ గార్డులను తొలగించి వేధిస్తున్నారని తెలిపారు. బాధితులు అధికారుల చుట్టూ తిరిగినా వారి సమస్యను పరిష్కరించకుండా ఏజెన్సీ మామూళ్లకు అలవాటు పడిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఏజెన్సీలకు లాభాలు తెచ్చిపెడుతున్న సీనియర్ సూపర్‌వైజర్లు అకారణంగా చాలా మంది కార్మికులను తొలగిస్తూ వారి స్థానంలో కొత్తవారిని డబ్బులు తీసుకొని రిక్రూట్‌మెంట్ చేస్తూ ఏజెన్సీ యాజమాన్యంతో చేతులు కలిపి పంచుకుంటున్నారని విమర్శించారు. ఆదాయానికి అలవాటు పడిన యాజమాన్యం రవితేజ, ఫిరోజ్ ఖాన్‌లు చేస్తున్న అవినీతి, అక్రమాలు తెలిసినా మహిళా సెక్యూరిటీ గార్డులను లైంగికంగా వేధిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిసినా యాజమాన్యం వారికే మద్దతుగా ఉందని గుర్తు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ఏజెన్సీ ఎమ్‌డితో మాట్లాడి అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని తక్షణమే తొలగించాలని, అక్రమంగా తొలగించిన సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు మహమూద్, నగర నాయకులు రాంబాబు, కుమార్, నాగరాజు, కిట్టు, అంజి, విశ్వనాథ్, మద్దిలేటి, చంద్రబాబు, మహేష్ పాల్గొన్నారు.



క్యాజువాలిటీ వద్ద ధర్నా చేపడుతున్న కార్మికులు, సెక్యూరిటీ గార్డులు



ర్యాలీని ప్రారంభిస్తున్న టిజి.వెంకటేష్, శంకర్ శర్మ

పతకాల ఆశతో ఉన్నాం

- మాజీ ఎంపీ టిజి.వెంకటేష్
- పతకాలతో వస్తే స్ఫూర్తి - ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ
- భారత్ క్రీడాకారులకు మద్దతుగా ర్యాలీ


ప్రజాశక్తి - కర్నూలు

ప్యారిస్ ఒలంపిక్స్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటి భారతావనికి వన్నె తెస్తారని మాజీ ఎంపీ టిజి.వెంకటేష్ తెలిపారు. గురువారం నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియం నుంచి క్రీడాకారులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. టిజి.వెంకటేష్, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్ శర్మ, సెకండ్ ఎపిఎస్‌పి బెటాలియన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బొల్లవరం రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టిజి.వెంకటేష్ మాట్లాడారు. దేశ క్రీడా రంగానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైతే క్రీడలు, కళలు వికసిస్తాయో అక్కడే శాంతి, సమగ్రత, సౌభ్రాతృత్వం ఉంటుందని తెలిపారు. అనంతరం డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడారు. రాష్ట్ర క్రీడాకారులకు ఒలంపిక్స్‌లో పాల్గొనే అవకాశం కలగడం అదృష్టమని తెలిపారు. పతకాల కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. ఈ ర్యాలీ స్టేడియం నుంచి ప్రారంభమై స్టేట్ బ్యాంకు సర్కిల్, చిన్న పార్కు, కోట్ల సర్కిల్, కోల్స్ కళాశాల మీదుగా కొండారెడ్డి బురుజు వరకు సాగింది. క్రీడా సంఘ ప్రతినిధులు హర్షవర్ధన్, నాగరత్నమయ్య, వంశీ, నవీన్, గుడిపల్లి సురేందర్, జాఫర్, మున్నా, షేక్షావలీ, శ్రీనివాసులు, విజయకుమార్, వేణుగోపాల్, ప్రసాద్, ఎమ్ఎమ్‌డి.బాష, పరశురాం, ప్రభాకర్, షకీల్, నవి సాహెబ్, జాకీర్, మధు, చిన్న సుంకన్న, ప్రతాప్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఎంపిడిఒ రామారావు

ప్రజాశక్తి - పత్తికొండ



ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ రామారావు తెలిపారు. గురువారం మండలంలోని హోసూరు గ్రామంలో పర్యటించారు. పురవీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను జెసిబి ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. పంచాయతీ ఆధ్వర్యంలో పురవీధుల్లో డ్రెయినేజీలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నామన్నారు. చిన్నపిల్లలు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇఒఆర్‌డి మునిస్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

ఎపిలో మొదటి సిఎపిఎ ఐవిఎం బేబీ

- ప్రకటించిన ఒయాసిస్ ఫెర్టిలిటీ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

భారతదేశంలో ప్రముఖ సంతాన సాఫల్య కేంద్రమైన ఒయాసిస్ ఫెర్టిలిటీ రాష్ట్రంలో మొదటి సిఎపిఎ ఐవిఎం బేబీ జననం, సంతాన సాఫల్యం చికిత్స, సంరక్షణ ముఖ్యమైన మైలురాయిని సూచిస్తూ బేబీ షవర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులకు వారి ప్రయాణంలో అధునాతన సాంకేతిక చికిత్సలు, అవసరమైన మద్దతును అందిస్తోంది. సాఫల్య సంరక్షణలో ముందంజలో భాగంగా ఒయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రం ప్రీఇంప్లాంటేషన్ జెనెటిక్ టెస్టింగ్ ఫర్ అనూప్లోయిడీస్ కోసం వంటి అధునాతన చికిత్సలతో క్లినికల్ ఎక్సలెన్స్‌ను మిళితం చేస్తోంది. గర్భధారణ సవాళ్లను ఎదుర్కొంటున్న జంటలు, క్రోమోజోమ్ అసాధారణతలు ఉన్న కుటుంబాలు ఆరోగ్యకరమైన జీవసంబంధమైన పిల్లల పుట్టుకను సాధించడంలో సహాయ పడటానికి ఈ పురోగతులు ఎంతో ముఖ్యమైనవి. డ్రగ్-ఫ్రీ ఐవిఎఫ్ఎంపిక 'సిఎపిఎ ఇన్ విట్రో మెచ్యూరేషన్'ను మొదటిసారిగా అందించడం ద్వారా ఒయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రం అనేది పిసిఒఎస్ ఉన్న రోగులకు లేదా మునుపటి ఐవిఎఫ్ చికిత్సలతో పేలవమైన ఫలితాలను పొందిన వారికి గణనీయ ప్రయోజనాలను అందిస్తోంది. కర్నూలులో ప్రారంభమైనప్పటి నుంచి ఒయాసిస్ ఫెర్టిలిటీ స్థానికంగా అధునాతన సంతాన సాఫల్య చికిత్సలను అందించడం ద్వారా ఆరోగ్య సంరక్షణ తీరుతెన్నులను మార్చింది. ఈ కేంద్రం 2,500 మంది సంతానం లేని జంటలను పరీక్షించింది. 300 జంటలకు ఐవిఎం అందించింది. ఆకట్టుకునే రీతిలో 75 శాతం విజయవంతమైన రేటును సాధించింది. దాతల చికిత్సల సరోగసీ ఎంపికలను అందిస్తోంది. గురువారం ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకులు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి.రావు మాట్లాడుతూ... ఒయాసిస్ ఫెర్టిలిటీకి, మేం సహాయం చేస్తున్న కుటుంబాలకు నేటి వేడుక ఒక పెద్ద మైలురాయి అని తెలిపారు. రాష్ట్రంలో మొదటి సిఎపిఎ ఐవిఎం శిశువు జననం, సంతాన సాఫల్య చికిత్సల్లో శ్రేష్టత, వినూత్నత పట్ల తమ అంకితభావాన్ని చూపుతోందని చెప్పారు. తల్లిదండ్రులు కావాలనే వారి కలలను సాకారం చేసేందుకు తాము ఉత్తమ పరిష్కారాలను అందించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కర్నూలు కేంద్రానికి సారథ్యం వహిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... ఒయాసిస్ ఫెర్టిలిటీలో ఇది తమకు గర్వకారణమని తెలిపారు. స్థానిక ప్రజలకు సంతాన సాఫల్య చికిత్సలు, అధునాతన సంతాన సాఫల్య సంరక్షణను అందరికీ విజయవంతంగా అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు.



కర్నూలులోని ఒయాసిస్ ఫెర్టిలిటి సెంటర్‌లో మొదటి బేబీ చూస్తున్న వైద్యులు

అధిక సాంద్రతలో పత్తి సాగుతో అధిక లాభాలు : ఎడిఎ

ప్రజాశక్తి - వెల్దుర్తి

అధిక సాంద్రతలో పత్తి పంటను సాగు చేయడం వల్ల రైతులు గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గించి అధిక దిగుబడిని పొంది సంవత్సరానికి రెండు పంటలు పండించవచ్చని ఎడిఎ మోహన్ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని రామళ్లకోట గ్రామంలో ఎడిఎ మోహన్ విజయ్ కుమార్, డిటిసి వెంకటేశ్వర్లు, ఎఒ మధుమతి, ఎఒ అక్బర్ బాషాలు రైతు సేవా కేంద్రం సిబ్బందితో కలిసి ఆత్మ ఆధ్వర్యంలో మాసుం వలీ పొలంలో అధిక సాంద్రతలో పత్తి పంట సాగులో భాగంగా విత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక సాంద్రత పద్ధతిలో ఎకరానికి 14,814 మొక్కలతో పత్తి పంట సాగు చేయవచ్చని తెలిపారు. కంది, ఆముదవం, పత్తి పంటలను పరిశీలించి రైతులు తీసుకోవాల్సి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

రైతులకు అందుబాటులో ఉండండి

మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి వ్యవసాయ పథకాలపై సమీక్ష నిర్వహించారు. రైతులకు అందుబాటులో ఉండి వివిధ పంటలపై సలహాలు, సూచనలు ఇస్తూ అవగాహన కల్పించాలని ఎడిఎ మోహన్ విజయ్ కుమార్ ఆదేశించారు.



మాట్లాడుతున్న అధికారులు

శానిటేషన్‌పై డిపిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - మద్దికెర

శానిటేషన్‌పై ఆకస్మిక తనిఖీ చేసినట్లు డిపిఒ నాగరాజ్ నాయుడు తెలిపారు. గురువారం మద్దికెరలో పంచాయతీ అధికారులతో కలిసి వీధుల్లో తిరిగి శానిటేషన్ పనులు, తాగునీటి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి పంచాయతీ వీధుల్లో డ్రెయినేజీలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అధికారులకు సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. చిన్నపిల్లలు, బాలింతలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం డిపిఒ నాగరాజుకు శాలువాలతో సన్మానం చేశారు. సర్పంచి బండారు సుహాసిని, వార్డు మెంబర్లు చంద్రశేఖర్ గౌడ్, బాలు, పంచాయతీ సలహాదారుడు ఆంజనేయులు, పంచాయతీ అధికారులు మద్దిలేటి స్వామి, సుధాకర్, రేణుక పాల్గొన్నారు.

1, 2న శిక్షణ తరగతులు

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2న కర్నూలులో జరిగే సామాజిక చైతన్య శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు కోరారు. గురువారం స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో సమావేశం నిర్వహించారు. సంఘం మండల కన్వీనర్ మదన గోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎస్.చక్రపాణి మాట్లాడారు. రాష్ట్రంలో పాలకులు మారారు తప్ప, దళితుల పరిస్థితులు మాత్రం మారలేదన్నారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళను ట్రాక్టర్‌తో గుద్ది చంపారన్నారు. వెల్దుర్తి మండలం రత్నపల్లి గ్రామంలో దళితుల పంటను నాశనం చేసి దళిత మహిళపై విచక్షణ రహితంగా దాడి జరిగి నెలరోజులు పూర్తయినా పోలీసులు దాడి చేసిన వారికి అండగా నిలబడి దళితులపై కేసు నమోదు చేశారన్నారు. ఈ దుర్మార్గమైన దాడులను, అంటరానితనాన్ని ఎదిరించడానికి దళితుల్లో చైతన్యం తప్ప వేరే మార్గం లేదన్నారు. జిల్లాలో ఉన్న సామాజిక ఉద్యమకారులనంతా సమీకరించి కర్నూలు, ఆదోని రెండు చోట్ల సామాజిక చైతన్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, వాటిలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కెవిపిఎస్ మండల నాయకులు రత్నం, బీదన్న, వెలుగుల రాముడు, రాజామణి, శీను, నాగేశ్వరరావు, దాసు, మద్దిలేటి, రంగన్న, వెంకటేశ్వర్లు, దండన్న, బజారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

నామినేషన్ల పరిశీలన పూర్తి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ స్థాయీ సంఘం కమిటీ సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. గురువారం నగరపాలక కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసిన కార్పొరేటర్ల సమక్షంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు పరిశీలన చేపట్టారు. నామినేషన్ పత్రాలన్నీ సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు. అలాగే ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఆర్ఒ జునైద్, క్లర్క్ జిఎం శ్రీకాంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - సి బెళగల్

బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని తహశీల్దార్ అనుపమ తెలిపారు. బుధవారం మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసి బాలికలతో ముచ్చటించారు. విద్యలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ఆ దిశగా కష్టమైన ఇష్టంగా చదవాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను సాధించాలని ఆకాంక్షించారు.

ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - సి బెళగల్

రైతులు కొనుగోలు చేసే ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఎఒ మల్లేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం బెళగల్‌లోని మురళీ సాయి, నాగసాయి తదితర దుకాణాలను తనిఖీ చేశారు. ఇక్కడే స్టాకు బోర్డును, ధరల పట్టికను, గోడౌన్లను, బిల్లులు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువులను, మందులను, విత్తనాలను అధిక ధరలకు అమ్మి సొమ్ములు చేసుకొంటే చర్యలు తప్పవని, రెన్యువల్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

జోరుగా పైపులైన్ పనులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం బి.తండ్రపాడు గ్రామంలో తాగునీటి పైపులైన్ పనులను జోరుగా సాగిస్తున్నట్లు సర్పంచి ఆకెపోగు జయన్న తెలిపారు. గురువారం ఆయన మయూరి వాటర్ ఫాంట్ కాలనీలో సాగుతున్న పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామంలో జోరుగా పనులు సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం మారుతి నివాస్ కాలనీ, రాగమయూరి వాటర్ ఫాంట్ కాలనీలకు తాగునీటిని అందించేందుకు పంచాయతీ సాధారణ నిధుల నుంచి రూ.12 లక్షలతో ఈ పనులను చేపట్టామన్నారు. ఇంటింటికి మంచినీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులను గ్రామంలో చేపడతామన్నారు.


ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. విద్యారంగ పరిరక్షణ కార్యాచరణలో భాగంగా యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం తహశీల్దార్ పార్వతి, ఎంపిడిఒ సోనీ బాయి, ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్దిలేటి, చంద్రపాల్ మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేస్తూ తీసుకొచ్చిన జిఒ 117ను రద్దు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలను 1 నుంచి 5వ తరగతి వరకు యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం ఉండాలని తెలిపారు. హైస్కూళ్లలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరారు. మండల గౌరవ సలహాదారులు రాముడు, వెంకటరమణ, సహాధ్యక్షులు అక్బర్, ఆర్థిక కార్యదర్శి నాగేశ్వరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గుమ్మల బాబు, లక్ష్మణ్, సుంకన్న పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

- ఎంపిడిఒ రఘునాథ్ గుప్త

ప్రజాశక్తి - కౌతాళం


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎంపిడిఒ రఘునాథ్ గుప్త తెలిపారు. గురువారం మండలంలోని కుంబాలనూర్ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో మురుగు కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వ ఉండకుండా, నీటిని కాచిచల్లారిన తర్వాత తాగాలని సూచించారు. జ్వరాలు వస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. సర్పంచి వీరేష్, పంచాయతీ కార్యదర్శి యోగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలి

- ఎంపిడిఒకు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


ఎంపిడిఒకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

మండలంలోని పాండవగల్ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఈరమ్మను కొనసాగించాలని గ్రామస్తులు కోరారు. గురువారం వ్యకాస నాయకులు, ఉపాధి మేటీలు, కూలీలు ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న మాట్లాడారు. గత 2006 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 18 ఏళ్లుగా పాండవగల్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఈరమ్మ పని చేస్తున్నారని తెలిపారు. ఆమె పనుల్లో ఎలాంటి అవకతవకలూ, అవినీతి, అక్రమాలు లేకుండా నీతి, నిజాయితీగా పని చేస్తున్నారని చెప్పారు. అలాంటి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించడం వల్ల గ్రామంలో పనులు నిలిచిపోయి ఉపాధి కూలీలకు నష్టం కలుగుతోందని తెలిపారు. ఆమెను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉపాధి అధికారులు అధికార పార్టీ ఒత్తిడి మేరకు తొలగించాలని చూడడం సరికాదని తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, పాండురంగ, ఉపాధి హామీ మేటీలు కె.హుస్సేని, అనంత ఆంజనేయ, హనుమంతు రెడ్డి, ఉపాధి కూలీలు హుస్సేని, కొండయ్య, రమేష్, హనుమంతు రెడ్డి, భీమయ్య, రాము, మల్లికార్జున, గోవిందు రెడ్డి, చిన్నన్న, రామాంజనేయ, ఫక్కీరయ్య పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి ఒకరు మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్లు-కరివేముల రహదారి మధ్యలో గురువారం ఆటో బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన కల్లు శ్రీరాములు (42) ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవారు. కరివేముల నుంచి స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు మధ్యలో గుంతలు తప్పించబోయి అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య రామాంజనమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల కూల్చివేతలో పారదర్శకత పాటించాలి

- కక్ష సాధింపు ధోరణి వీడాలి - కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో గృహాల ముందు ఆక్రమణల కూల్చివేతలో అధికారులు పారదర్శకత పాటించాలని, కక్ష సాధింపు ధోరణి అవలంభించడం తగదని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని ఆర్‌టిసి కాలనీ సమీపంలో తన ఇంటి ముందు ర్యాంపును మాత్రమే మున్సిపల్ అధికారులు తొలగించి సమీపంలో ఉన్న గృహాలను వదిలేయడంపై కమిషనర్ రామచంద్ర రెడ్డిని ఆదోనిలోని కార్యాలయంలో ప్రశ్నించారు. అధికారులతో మాట్లాడుతుండగానే టూ టౌన్


అధికారులతో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

ఎస్ఐ అత్యుత్సాహం ప్రదర్శించి తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నోటీసు కూడా జారీ చేయకుండా ఉన్నపలంగా అధికారులు ర్యాంపును తొలగించడం తగదని తెలిపారు. ఆదోనిలో కాంగ్రెస్ బలపడుతుందన్న అక్కసుతోనే తమను ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నంలోనే భాగంగానే ఈ చర్యకు పాల్పడ్డారని విమర్శించారు. తన ఇంటి సమీపంలోని మరో ఇంట్లో కమిషనర్ రామచంద్ర రెడ్డి నివాసం ఉన్నారని, ఆయనకు అక్రమ కట్టడమని తెలియదా అంటూ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులును ప్రశ్నించారు. పట్టణంలో ఎన్నో అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటి జోలికి ఎందుకు వెళ్లడం లేదని నిలదీశారు. ఇలాగే వ్యవహరిస్తే అధికారుల చర్యలపై పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ఢోకా మాట్లాడుతూ... ఆదోని అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని తెలిపారు. రోజుకు ఒక ఇల్లు, వీధికి ఒక ఇల్లు కూలుస్తుపోతే చూస్తూ ఊరుకోబోమని చెప్పారు. వారం క్రితం కొత్తబస్టాండ్ రోడ్డులో చిన్న బంకులను తొలగించి ఉపాధి దూరం చేశారని తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద ఒక్క బంకును తొలగించి అతనికి ఉపాధి లేకుండా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఏ ప్రాంతంలో అక్రమ కట్టడాలు కూల్చివేస్తారో సంబంధిత యజమానులకు తెలియజేసిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. విద్యార్థి విభాగం నాయకులు శ్రీనిత్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే మెప్పు కోసమే అక్కడక్కడ ఆక్రమణలు కూలుస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షులు సాయినాథ్, తాయన్న పాల్గొన్నారు.


ఎస్ఐతో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

'పారిశుధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు'

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, పరిశుభ్రతపై సచివాలయ సిబ్బంది, గ్రామాధికారులు, హెల్త్ సిబ్బంది అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ పద్మజ, ఎంపిడిఒ బరేన్ సాహెబ్ హెచ్చరించారు. గురువారం మండలంలోని గుమ్మనూరు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ పద్మజ, చిప్పగిరిలో రెవెన్యూ కార్యదర్శి తిమ్మప్ప ఆధ్వర్యంలో ఎంపిడిఒ బరేన్ సాహెబ్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలు ఎక్కువ రద్దీగా ఉన్న


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న తహశీల్దార్ పద్మజ

వీధుల్లో చెత్తాచెదారం, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంచాలని కోరారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు పారిశుధ్య నిర్వహణపై చాలా సీరియస్‌గా ఉన్నారని, ఏమాత్రం అశ్రద్ధ వహించినా శాఖమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విఆర్ఒ రంగన్న, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, హౌసింగ్ అధికారులు కృష్ణ కుమార్, భవ్య పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం : ఎఇ

ప్రజాశక్తి - ఆలూరు

గ్రామ, పట్టణ ప్రాంతాల్లో, రైతుల పొలాల్లో ఉన్న విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సంక్రమించే విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఆలూరు విద్యుత్ ఎఇ గురప్ప సూచించారు. గురువారం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గాలివానకు పొలాల్లో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లపై నిఘా ఉంచి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను వంద శాతం వసూలు చేయాలని చెప్పారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు పంపావతి, ఖలందర్ పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా రావి ఆకుపై చిత్రం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



ఈనెల 26న కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా అలసందగుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని తలారి నిఖిత రావి ఆకుపై దేశ సైనికులు, త్రివర్ణ పతాకాన్ని కత్తిరించి చిత్రాన్ని తయారు చేశారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన దేశ సైనికులను స్మరించుకునేందుకు ఈ చిత్రాన్ని చేసినట్టు నిఖిత తెలిపారు. డ్రాయింగ్ ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణతో ఈ చిత్రాన్ని చేసినట్లు పేర్కొన్నారు. చిత్రాన్ని చూసి ప్రధానోపాధ్యాయులు గిరిజాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

కస్తూరిబాలో జిల్లా అధికారుల విచారణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో కస్తూరీ బా పాఠశాలలో జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భోజనాలు వండించడం లేదనే ఫిర్యాదు మేరకు గురువారం కస్తూరిబా పాఠశాలలో సంబందిత జిల్లా అధికారులు కస్తూరిబా అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యేల్ పాల్, డిప్యూటీ డిఇఒ వెంకటరమణ, జిసిడిఒ స్నేహ లత విచారణ చేపట్టారు. పట్టణంలోని మైనార్టీ కాలనీలో కస్తూరిబా పాఠశాలలో భోజన వసతులు సరిగా లేనందువల్ల సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. ఈ విషయంపై విద్యార్థుల దగ్గరికెళ్లి విచారణ చేపట్టారు. ఇక్కడ ఉడికీ ఉడకని అన్నం, చాలీచాలని అన్నం పెడుతున్నారని, అర్థాకలితో తమ కడుపు మాడుస్తున్నారని బాలికలు తెలిపారు. ఈ జరిగిన సంఘటనలపై ఉపాధ్యాయులు ఎలాంటి ప్రమేయమూ లేదని, ప్రిన్సిపల్ ఇక్కడ వంట మనుషులపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఎంఇఒ-1 ఆంజనేయులు, ఎంఇఒ-2 మధుసూదన్ పాల్గొన్నారు.


విచారణ చేపడుతున్న అధికారులు

చిన్నమరివీడు బాలిక సింధుకు గోనెగండ్ల కెజిబివిలో సీటు

- ఎడి శామ్యూల్ పాల్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని చిన్నమరివీడు గ్రామానికి చెందిన బోయ సింధు అనే బాలికకు గోనెగండ్ల కెజిబివిలో సీటు లభించింది. తనకు గోనెగండ్ల కెజిబివిలో సీటు కల్పిస్తే చదువుకోవాలని ఉందని, కుటుంబ కారణాల వల్ల వారంలో మూడు రోజులు తమ గ్రామంలోని పాఠశాలకు, మిగతా రోజులు పొలం పనులకు వెళ్లాల్సి వస్తోందని సింధు గతంలో కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రంజిత్ బాషా బాలిక కుటుంబ పరిస్థితులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం గోనెగండ్ల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఎడి శామ్యూల్ పాల్ సందర్శించారు. స్థానిక కెజిబివిలో వసతులు, విద్యాబోధన, భోజన వసతులను పరిశీలించారు. మండలంలోని చిన్నమరివీడు గ్రామానికి చెందిన బాలిక బోయ సింధు గ్రామానికి వెళ్లి మండల అధికారులు వివరాలు సేకరించారని తెలిపారు. వారిచ్చిన సమాచారంతో, కలెక్టర్ ఆదేశాల మేరకు బాలికకు గోనెగండ్ల కెజిబివిలో 9వ తరగతిలో ప్రవేశం కల్పించినట్లు చెప్పారు. బాలిక కూడా తనకు అధికారులు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకుంటానని, క్రీడారంగంలో కూడా రాణిస్తానని తెలిపారు. ఎంఇఒ-1 రామాంజనేయులు, ఎంఇఒ-2 నీలకంఠ, బాలిక తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్



ఎల్ఎల్‌సిలో పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని ఎల్ఎల్‌సి కాలువలో పూడికతీత పనులను టిడిపి నాయకులు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి పరిశీలించారు. గురువారం కోసిగి సమీపంలోని ఎల్ఎల్‌సి కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. గతంలో ఎల్ఎల్‌సి కాలువలోకి డ్రెయినేజీ నీళ్లు, మురుగునీరు కలిసేవని, దీని ద్వారా రైతులు, ప్రజలకు కాలువలో నీళ్లు దుర్వాసన వచ్చేవని తెలిపారు. కాలువలోకి డ్రెయినేజీ నీళ్లు రాకుండా అడ్డుకట్ట వేసి కాలువలో పేరుకుపోయిన బురద, చెత్తాచెదారం వంటివి తొలగించినట్లు చెప్పారు. ఆయకట్టు రైతులందరికీ ఎల్ఎల్‌సి ద్వారా సాగునీరందిస్తామని తెలిపారు. టిడిపి నాయకులు నాడిగేని చిన్న తాయన్న, కొండగేని నరసన్న పాల్గొన్నారు.

ఘనంగా జయతీర్థుల ఆరాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో శ్రీజయతీర్థుల పూర్వారాధనను పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయన చిత్రపటాన్ని స్వర్ణరథంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. అంతకుముందు శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు శ్రీజయతీర్థుల అష్టోత్తరాన్ని పారాయణం చేశారు. ఈ సందర్భంగా శ్రీమఠం ప్రాకారంలో రథోత్సవ ఊరేగింపు వైభవంగా జరిగింది. శ్రీజయతీర్థులకు మంగళ హారతి నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఊంజల మండపంలో శ్రీమఠం పండితుల ఉపన్యాసాలు భక్తులకు ఆధ్యాత్మిక బోధనలు, శ్రీజయతీర్థుల చరిత్ర గురించి వివరించారు.

పంటలపై జింకల దాడి

- పంటలను కాపాడండి : రైతులు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పొట్లపాడు, కుంకనూరు, కొత్తపేట, అలారుదిన్నె, కరిడి కొండ, పుల్లాపురం, తెర్నేకల్లు, బెల్లందొడ్డి తదితర గ్రామాల్లో జింకలు పొలాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయని, జింకల బెడద నుండి పంటలను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పత్తి, టమోటా, వేరుశనగ, మిరప, ఉల్లి తదితర పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నామని తెలిపారు. ఉదయం, రాత్రి వేళల్లో జింకలు


పొలాల్లో సంచరిస్తున్న జింకలు

సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఆలూరు నియోజకవర్గంలోని జింకల పార్కు ఏర్పాటు కలగానే మారుతోందని వాపోయారు. జింకల బెడద నుంచి పంటలను కాపాడడానికి జింకల పార్కు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో మాత్రం హామీలు ఇస్తున్నారే తప్ప, అమలు చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వం, సంబంధిత జిల్లా అధికారులు స్పందించి జింకల బెడదను నివారించాలని ఆయా గ్రామాల రైతులు కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- డిఎల్‌పిఒ నూర్జహాన్

ప్రజాశక్తి - కోసిగి

వర్షాకాలం రావడంతో ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలని ఆదోని డిఎల్‌పిఒ నూర్జహాన్ తెలిపారు. గురువారం కోసిగి మేజర్ పంచాయతీలోని గాంధీ నగర్‌లో ఉన్న డ్రెయినేజీలను, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ నూర్జహాన్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే తాగునీటిని వేడి చేసుకుని తాగాలని సూచించారు. అనంతరం స్పందనలో వచ్చిన డ్రెయినేజీ సమస్యపై విచారణ చేపట్టారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ప్రజలు పంచాయతీ బకాయిలను సకాలంలో చెల్లించాలని కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య, పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డికి సూచించారు. మండగిరి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, కోసిగి పంచాయతీ సెక్రటరీ తిరుమలేశ్వర్ రెడ్డి, మాణిక్య రాజు ఉన్నారు.

బడ్జెట్‌పై సెమినార్ శుభపరిణామం

- ప్రిన్సిపల్ మురళీమోహన్

ప్రజాశక్తి - ఆదోని

బడ్జెట్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవడం కోసం సెమినార్ నిర్వహించడం శుభపరిణామమని ప్రిన్సిపల్ పి.మురళీ మోహన్ తెలిపారు. గురువారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2024-25 కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండేలా సంతులిత బడ్జెట్ అవసరమని తెలిపారు. విద్యార్థులు బడ్జెట్‌పై ప్రసంగించడంతోపాటు పేపర్లు సమర్పించారు. రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.అయ్యప్ప, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.బాలస్వామి, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణ, గోవిందు, ఎల్లప్ప, నిఖిల్, ఈరన్న, వెంకటరామి రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

వేతన సవరణ కమిటీ ఛైర్మన్‌ను నియమించాలి

- ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు

ప్రజాశక్తి - ఆదోని

వేతన సవరణ కమిటీ ఛైర్మన్‌ను వెంటనే నియమించాలని ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ జి.వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు వి.రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని ఎస్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో పట్టణ ఆర్థిక కార్యదర్శి జంబులయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఉద్యోగులను, ఉపాధ్యాయులను ఆర్థికంగా ఇబ్బందులు పెట్టిందని విమర్శించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన కరువు భత్యం బకాయిలు, సరెండర్ లీవ్‌లకు సంబంధించిన సొమ్ము, పిఆర్‌సి బకాయిలు, ఎపిజిఎల్ఐ, జిపిఎఫ్ రుణాలు, పండగ అడ్వాన్స్‌లు రావాల్సిన సొమ్మును గత ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించి ఆదుకోవాలని కోరారు. జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, భీమరాజు, వీరేష్, గంగానాయక్, వెంకట్రామిరెడ్డి, శ్రీరాములు, జయరాముడు, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం

- జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్

ప్రజాశక్తి - ఆలూరు


ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్న సెబ్ అధికారులు

కర్ణాటక మద్యం, సారా తరలించినా, అమ్మినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ హెచ్చరించారు. గురువారం ఆలూరు సెబ్ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో మద్యం తరలిస్తూ పట్టుబడిన 8 ద్విచక్ర వాహనాలకు వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. 8 ద్విచక్ర వాహనాలు గవర్నమెంట్ విలువ రూ.1,02,400 కాగా వేలం పాటలో జిఎస్‌టితో కలిపి రూ.1,79,950 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఆలూరు సెబ్ పరిధిలో 125 కేసుల్లో పట్టుబడిన 3,175 లీటర్ల కర్ణాటక మద్యం, నాటుసారాను మొలగవల్లి గ్రామ మార్గంలో జెసిబి సహాయంతో ధ్వంసం చేసినట్లు చెప్పారు. సిఐ సోమశేఖర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది విజయుడు, చంద్రన్న, రామలింగమ్మ, లక్ష్మి దేవి పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - మంత్రాలయం

కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎఒ జీరా గణేష్ కోరారు. గురువారం మండలంలోని మాలపల్లి గ్రామంలోని గ్రామ సచివాలయంలో కౌలు రైతులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని కౌలు రైతులందరూ కౌలు రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డులను దరఖాస్తు చేసుకుని ప్రభుత్వం వారు ఇచ్చే లబ్ధిని పొందాలని తెలిపారు. పంట బీమా, సబ్సిడీలో విత్తనాలు, ఎరువులను పొందవచ్చని చెప్పారు. విఆర్ఒ రాజు, ఎంపిఇఒ రాజేశ్వరి పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

- బాధితురాలు సుభాషిణి

ప్రజాశక్తి - వెల్దుర్తి

బీసీ వెల్ఫేర్ అధికారి పి.వెంకటలక్ష్మమ్మపై చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి మండలం మదార్‌పురం గ్రామానికి చెందిన ఎం.సుభాషిణి కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను వన్ స్టాప్ సెంటర్‌లో ఐటి ఉద్యోగిగా పని చేస్తున్నట్లు తెలిపారు. బీసీ వెల్ఫేర్ అధికారి పి.వెంకటలక్ష్మమ్మ మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖకు ఇన్‌ఛార్జీగా ఉన్నారని తెలిపారు. ఈ శాఖలో అవినీతి చాలా దారుణంగా ఉందని చెప్పారు. ఈ శాఖలో భాగమైన సఖి (దిశా) వన్ స్టాప్ సెంటర్‌లో ఉద్యోగులుగా పని చేస్తున్న వారు చట్టపరమైన ఉద్యోగులు కాదని తెలిపారు. విద్యార్హతలు లేకున్నా ఆ శాఖాధికారులు వారిని అక్రమంగా ఉద్యోగాల్లో కొనసాగిస్తున్నారని చెప్పారు. వారి నుంచి పీడీ, వెల్ఫేర్ అధికారి పి.వెంకటలక్ష్మమ్మ, శాఖ ఇతర అధికారులు రూ.లక్షల్లో లంచాలు తీసుకుని వారిని కొనసాగిస్తున్నారని వాపోయారు. అవినీతికి పాల్పడి ఎంతోమంది మహిళలకు, బాధితులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. వన్ స్టాప్ సెంటర్‌లో విద్యార్హతతో వచ్చిన ఉద్యోగులు ఏమైనా రూల్స్ మాట్లాడితే వారిని లక్ష్యంగా చేసి మానసికంగా వేధిస్తూ, వారిని



ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని వాపోయారు. అలా వెంకటలక్ష్మమ్మ చేతిలో తాను కూడా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందనలో కలెక్టర్‌కు పీడీ, పి.వెంకటలక్ష్మమపై ఫిర్యాదు చేశానని తెలిపారు. విద్యార్హత లేని ఐటి సరస్వతిని ఉద్యోగిగా కొనసాగిస్తున్నారని చెప్పారు. విద్యార్హత ఉన్న తనను ఉద్యోగంలో నుంచి తీసేశారని, తాను కమిటీ సభ్యులు నిర్వహించిన మౌకిక పరీక్షల్లో ఎన్నికయి న్యాయంగా వచ్చానని తెలిపారు. పీడీ హయాంలో విద్యావంతులకు అన్యాయం జరిగిందని, అవినీతిపరులపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వన్ స్టాప్ సెంటర్‌లో అక్రమంగా కొనసాగుతున్న నలుగురు ఉద్యోగులను తొలగించి, వీరి నుంచి లంచం తీసుకుని ఉద్యోగాల్లో కొనసాగేలా సహకరించిన పీడీ, పి.వెంకటలక్ష్మమ్మపై, ఇతర ఈ శాఖ అధికారులపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వన్ స్టాప్ సెంటర్‌లో విద్యార్హత లేకున్నా అక్రమంగా ఉద్యోగులుగా కొనసాగుతున్న వారిని విధుల నుంచి తొలగించాలని కోరారు.